# అమ్మ రాసిన ఉత్తరం...

చిరంజీవులు వసంత్ (హైదరాబాద్)కి, రాజన్ (ఖమ్మం)కి, మోహన్ (సిరిసిల్ల)కి, జాహ్నవి (వరంగల్)కి...

మీ అమ్మ దీవించి వ్రాయునది.

మీ నాలుగు ఉత్తరాలు అందాయి. కోడళ్లు, మనవలు, మనవరాళ్లు క్షేమమని తలుస్తాను. భగవంతుని దయవల్ల నాన్నగారి ఆర్యోగం మామూలుగానే వుంది.

మే 10న అందరం వస్తున్నామని... ఆరోజు 'మదర్స్‌డే' కాబట్టి... అంతా కల్సి నాకు పండుగ చేస్తామని రాసారు. మీ ఉత్సాహం చూసాక ఎంతో సంతోషమేసినా అదెంతోసేపు నిలువలేదు.

ఎందుకో తెల్సా...?

ఏడాదిలో 'ఒక రోజు' తల్లికోసం కేటాయించడమేమిట్రా ? కన్నవాళ్ల జీవితం మొత్తం క్షణక్షణం తల్లిదండ్రుల శ్వాసతో, ఆశతో చుట్టేయబడివుంటే... కొడుకులు కూతుళ్లు మాత్రం పాశ్చాత్య నాగరికంలో పడి వెర్రి పండగలకి ఆదరణ చూపడమేంటి? మీలో దసరాకి ఒకడొచ్చి వెళ్తే, దీపావళికి మరొకడొచ్చి వెళ్లేవాడు. ఉగాదికి ఇంకొకరొచ్చేవాళ్లు. అంతేకాని నలుగురూ కల్సివచ్చి జరుపుకున్న పండగేదైనా వుందా? అలాంటిది ఈ మదర్స్ డేని ఎవడు పుట్టించాడు? విదేశాల్లో విడాకులెక్కువై తల్లిదండ్రులకు దూరమైన పిల్లలు ఆ ఒక్కరోజైనా తల్లితో గడపాలనే ఆశపడి సృష్టించుకున్న రోజది. దాన్ని మీరు రుద్దుకోవడమేంటి? ఒక్కొక్కర్నీ దాదాపు రెండువందల

..నభై రోజులు మిమ్మల్ని మోసినప్పుడు... కడుపు తీపితో ఇంకా మోయాలనుకున్నాం కాని... ఇలాంటి 'డే' లతో ఒక్కరోజులో మిమ్మల్ని కనలేదే? అలాంటిది ఏడాదిలో ఒక్కరోజు తల్లికి... పండగ జరపటం నిజంగా దౌర్భాగ్యమే. నాగరికత ముసుగులేసుకొని గంతులేసినా... పరీక్ష నాళికల్లో ప్రాణాలు పోసుకున్నా... ఉమ్మనీరుని టెస్ట్‌ట్యూబ్‌ల్లో సృష్టించలేరు... అమ్మతనాన్ని ఇంటర్‌నెట్‌లలో అనుభూతించలేరు. మట్టివాసన పరిమళాన్ని మించిన అమ్మతనం... గొప్పదనాన్ని జీవితమంతా ఆస్వాదించాల్సిందే కాని... మదర్స్ డే పేరుతో ఒక్కనాటి పండగ చేసుకోవటం మీ వెర్రితనం, అమాయకత్వం.

ఇలా రానురాను మదర్స్ డేలు, ఫాదర్స్ డేలు చివరికి భార్యాభర్తలు గడపడానికి ఏడాదిలో ఏదోరోజు ఎన్నుకొని వైఫ్‌డే అనో, హజ్బెండ్ డే అనో, కపుల్స్ డే అనో ఒకరోజు సంసారం చేసిపోయే దౌర్భాగ్యపు స్థితిని మాత్రం ఈ దేశంలోకి తీసుకురాకండి.

మీకు తెలుసో లేదో...

వసంత్‌ని కనేముందు తొలికాన్పు పుట్టింటివాళ్లు చెయ్యాలని, మా అమ్మా నాన్న వచ్చి తీసికెళ్లినప్పుడు... ఆరువేలు అప్పు తీసుకువచ్చి కూడా మావాళ్లు ప్రసూతి చేయటం, ఆ అప్పు తీర్చడానికి మా అమ్మ మంగళసూత్రం అమ్ముకోవటం ఇంకా గుర్తు... ఇప్పటికీ వసంత్‌గాన్ని చూస్తే... చనిపోయిన మా అమ్మ మంగళసూత్రం ఓసారి గుర్తొస్తుంది.

రాజన్ పుట్టాక మేం పడ్డ కష్టాలు అన్నీ ఇన్నీ కావు. నెల జీతం సరిపోకపోయేది. వాడు రెండురోజులు బావుంటే అయిదురోజులు ఏదో జబ్బుతో మంచాన పడేవాడు. వాన్ని తీసికొని నేనూ, మీ నాన్న తిరగని ఆస్పత్రి లేదేమో... చివరికి మంత్రాలు, తాయెత్తులు కూడా వేయించాం. మీ నాన్నగారు 'ముదనష్టపు వెధవ' అని విసుక్కున్నా నేను మాత్రం వాన్నెప్పుడూ అశ్రద్ధ చేయలేదు. రోజులో ... గంటలు గుక్కపట్టి ఏడ్చేవాడు. ఎప్పుడూ రొమ్ము నోట్లోపెట్టి లాలించేదాన్ని. మరోవైపు మిషన్ కుడుతూ వచ్చిన డబ్బులో వానికి మందులు కొనేదాన్ని. వాడి ఏడ్పుచూసి ఒక్కోసారి దు... వచ్చేది. ... ...డేళ్లు వచ్చేంతవరకూ వాడితో ఎన్ని బాధలు పడ్డానో తల్చుకుం... ...స్తుంది.

అప్పుడే జాహ్నవి కడుపులోకొచ్చింది. మీ నాన్నగా... ... ...పుడుతుందని విశ్వాసం. లక్ష్మీదేవి పుట్టి తన జాతకమే మారిపోతుందని ఆయన ... ...నమ్మకం. చివరికి జాహ్నవిని కన్నరోజు ఆయన ఆనందం అంతా ఇంతా కాదు. లక్ష్మీదేవి పుట్టిందని భ్రమపడిపోయాడు. బొద్దుగా, అందంగా వుండంతో మరింత గారాబం చేసేవారు. కాని ఆర్థికస్థితి మరింత క్షీణించింది తప్ప ఏమీ ఎదగలేదు. అదృష్టాన్ని కూడా ఆడదాని పుట్టుకతో

ముడేసి మగజాతి కలలు కంటుంది అనడానికి ఆయనే నిదర్శనంగా కన్పించేవారు. లక్ష్మీదేవి పుడుతుంది అని ఆడవాళ్లకి ఆపాదించే బదులు... మా ఇంట్లో కుబేరుడు పుడుతున్నాడని ఎవరూ మురిసిపోరేం? జాహ్నవి పెరుగుతుంటే ఆయన హెచ్చరికలూ పెరిగేవి. కొడుకు చెడితే తండ్రి బాధ్యత, కూతుళ్లు చెడితే తల్లి బాధ్యత అంటూ పంపకాలు చేసేవారు. జాహ్నవి ఏ తప్పటడుగు వేస్తుందోనని ఎంత బెంగపడేదాన్ని. దాని పెళ్లికోసం పడ్డ కష్టం, ఆరాటం గుర్తొస్తే ఇవన్నీ సాధించింది మేమేనా? అన్పిస్తుంది.

పెళ్లయి సాగనంపేవరకూ దాని జీవితాన్ని పహారా కాసినట్టుగా ప్రతి కదలికను గమనిస్తూండేదాన్ని. ఒక్కోసారి శాసిస్తున్నందుకు బాధేసేది. కాని ఆయన కోసమైనా అలా చేయక తప్పిందికాదు. అందులోనూ మధ్య తరగతి వాళ్లం త్రిశంకుస్వర్గంలో ఊగిసలాడేవాళ్లం.

మోహన్ పుట్టుకతో... నా గర్భసంచీ కూడా తీసివేయాల్సిన పరిస్థితి వచ్చింది చిన్న కొడుకు అన్న గారాబంతో నేను తినకపోయినా వాడికి పెట్టేదాన్ని. వాడికి చదువులో తక్కువ మార్కులు వస్తున్నాయని ప్రోగ్రెస్ కార్డుల వెంట టీచర్లు లెటర్స్ రాస్తే... వాన్ని కూచోబెట్టుకొని రాత్రి పదకొండింటి వరకూ బుజ్జగిస్తూ చదువు చెప్పేదాన్ని. వాడు చదువుకోనని మొండికేసినా వాన్ని హాస్టల్‌లో వేసి చదివించాలని ఎంత ప్రయత్నం చేసాను. చివరికి వాన్ని హాస్టల్లో వేసి డబ్బు పంపించడానికి ఆయనతో పాటు నేనూ ఏదోరకంగా కష్టపడేదాన్ని. ప్రయోజకులు కావాలని కలలు కనేదాన్ని.

ఇలా మిమ్మల్ని ఒక్కొక్కరుగా... ఒక్కొక్కరుగా ఎదిగిపోయేలా చేసి వెనక్కి చూసుకుంటే మా వయసు కూడా ఎదిగిపోయింది. మా జీవితంలో మొత్తం రోజులు మీకోసం కేటాయిస్తే... మదర్స్ డే, ఫాదర్స్ డే అంటూ ఏడాదిలో ఒక్కరోజు మాకోసం కెటాయించడ మేమిట్రా...???

అందుకే... నేను మీ 'మదర్స్ డే' ని బాయ్‌కాట్ చేస్తున్నాను. వస్తే మీ అమ్మకోసం రండి. ఏడాదిలో మూడొందల అరవై రోజులూ మీకు మదర్స్ డేలే!!

అంతేకాని... ఏడాదిలో నాకోసం 'ఒక్కరోజు' అంటే భరించరానిదిగా వుందిరా... నాది అమాయకత్వమో, తెలివితక్కువ తనమో నాకే తెలీదు. కాని నేను మాత్రం మీ 'మదర్స్ డే' ని నిరసిస్తున్నాను.

ఇట్లు
మీ అమ్మ,
రాజేశ్వరి.

రాజేశ్వరమ్మ ఉత్తరం మడిచిపెడుతుంటే భర్త పరంధామయ్య వచ్చాడు. "ఎవరికి రాజీ... పిల్లలకి లెటర్ రాసావా? మదర్స్ డే జరుపుతామని రాసారు కదా! రమ్మని రాసావా? అయినా నీ పిచ్చిగాని... మదర్స్ డే నాడు... నువ్వు వంటింట్లోనే బలైపోతావ్. వాళ్లకి నచ్చినవన్నీ చెయ్యాలి కదా..." అంటూ నవ్వుకుంటూ బయటికెళ్లిపోయాడు.

"మదర్స్ డేని బాయ్‌కాట్ చేస్తున్నాను... మీరెవరూ రావద్దని రాసాను" అంది గంభీరంగా. పరంధామయ్య రాజేశ్వరి వైపు విచిత్రంగా తిరిగిచూసి నవ్వి వెళ్లిపోయాడు.

ఎందుకో... మనసంతా అస్తవ్యస్తంగా మారింది. తను రాసిన ఉత్తరాన్ని మరోసారి చదువుకుంది. ఏదో వెలితిగా అన్పించింది. పదాలు ఎబ్బెట్టుగా అన్పించాయి. పిల్లలంతా కల్సి వచ్చి ఒకరోజు ఆనందంగా వుండిపోతామంటే... తనేంటి ఇలా రాసింది? మదర్స్‌డేనో, విమెన్స్‌డేనో ఏదో ఒకరోజు... అంతావస్తే అదే పండగ అనుకోవాల్సింది పోయి... తను ఇలా రాసిందేమిటి? తన రాతల్లో నిజం లేదా? తన అక్షరాల్లో న్యాయం లేదా? వున్నా లేకున్నా వాళ్లు అంతాకల్సి రావటానికి మించిన పండగేముంది? ఛ... తప్పుగా రాసానేమో...? అనుకుంది.

ఆ వెంటనే... ఉత్తరాన్ని చించేసింది.

ముక్కలు ముక్కలుగా చించేసింది.

అమ్మకోపం... పాలపొంగులాంటిది!!!

★ ★ ★